క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు

వరికుంటపాడు: విరువూరు సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మార్గశిర మాసం సందర్భంగా పంచామృతాభిషేకం, తమలపాకుల పూజ నిర్వహించారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం

చేజర్ల: చేజర్ల కండ్రికలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎంపీపీ రావి పెంచలరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని కుర్షిద్ అమ్మాజీ దర్గాలో 37వ గంధ మహోత్సవాన్ని శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. దర్గా సజ్జదా మహ్మద్ సర్వర్షా చిస్తీ గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు జరిపి భక్తులకు గంధాన్ని పంపిణీ చేశారు.

నలుగురు వీఏఏల బదిలీ

వరికుంటపాడు: మండలం నుంచి నలుగురు గ్రామ వ్యవసాయ సహాయకులను అల్లూరు, కావలి మండలాలకు డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారి నుంచి ఉత్తర్వులు అందాయని మండల వ్యవసాయ అధికారి వీ రవికుమార్ ఆదివారం తెలిపారు. పెద్దిరెడ్డిపల్లె వీఏఏ జీ శ్రీకాంత్‌ను అల్లూరు మండలం ఇసుకపల్లి, కాంచెరువు వీఏఏ ఎం ఆదిత్యను అల్లూరు మండలం సింగపేట, వేంపాడు వీఏఏను జీ వినీల అల్లూరు మండలం సింగపేట, తూర్పుబోయమడుగుల వీఏఏను షేక్ షాజియాబేగాన్ని కావలి మండలం రుద్రకోట-1 గ్రామ సచివాలయానికి బదిలీ చేశారు. వీరిని రెండ్రోజుల్లో రిలీవ్ చేస్తామని తెలిపారు.

జాతీయ పక్షి సందడి



ఉదయగిరి: ఉదయగిరి అటవీ ప్రాంతంలో కొన్నేళ్ల తరువాత నెమళ్లు సందడి చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయంలో ఓ మోస్తరుగా నీరు చేరింది. దీంతో జలాశయం వెనుక వైపు ఉన్న కొండ ప్రాంతాన్ని నెమళ్లు ఆవాసంగా మార్చుకున్నాయి. జలాశయం పరిసర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో నెమళ్లు పురి విప్పి నాట్యం చేస్తూ ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నాయి.కాగా జాతీయ పక్షిపై కొందరు వేటగాళ్ల కళ్లు పడినట్లుగా స్థానికులు చెబుతున్నారు. అటవీ అధికారులు స్పందించి నెమళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

జలదంకి: మండలంలోని హనుమకొండపాళెంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో కావలి ఎక్సైజ్ సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాసిన లక్ష్మీప్రసన్న వద్ద 12 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు కావలి ఎక్సైజ్ ఎస్సై ఎం దేవిక తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

కావలి: పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిరసన తెలిపారు. రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుతో రాహుల్ గాంధీ అడ్డగోలు రాజకీయాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. రాజ్యాంగ నిర్మాతను బలవంతంగా మంత్రివర్గం నుంచి బయటకు పంపించి అవమానించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేశారు. అంబేద్కర్ పేరును అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. బీజేపీ నాయకులు కందుకూరు సత్యనారాయణ, గుండ్లపల్లి భరత్‌కుమార్, కుట్టుబోయిన బ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీక్రిస్మస్ వేడుకలు



సీతారామపురం : మండలంలోని సోంపల్లిలో గ్రేస్ ఇవాంజెలికల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రీక్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్యఅతిథిగా హాజరై క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సుమారు 200 మంది పేదలకు గ్రేస్ ఇవాంజెలికల్ మినిస్ట్రీస్ సంస్థ సమకూర్చిన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ అధ్యక్షులు నేలటూరి జాషువా, జనరల్ సెక్రటరీ ప్రభువరన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రబీ సాగుకు వాన దెబ్బ

- వరుస వర్షాలతో దెబ్బతిన్న నారుమళ్లు
- ముంపుతో ఆలస్యమవుతున్న వరినాట్లు
- నారుకు భారీగా పెరిగిన డిమాండ్
- ఎకరాకు సరిపడా నారుకు రూ.3,500 వరకు వెచ్చిస్తున్న రైతులు



ఎడ్లబండిలో వరినారును తరలిస్తున్న రైతులు

బిట్రగుంట: బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వరుస వాయుగుండాలు, అల్పపీడనాల ప్రభావంతో రైతులు కుదేలవుతున్నారు. బోగోలు మండలంలో ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా పొలాలు ముంపునకు గురై నారుమళ్లు దెబ్బతిన్నాయి. దీంతో వరినారుకు డిమాండ్ భారీగా పెరిగింది. అదను దాటిపోక ముందే నాట్లు వేసేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. మళ్లీ విత్తనాలు చల్లి నార్లు పోసి నాట్లు వేసేందుకు సుమారు 30 రోజులకుపైగా సమయం పడుతుంది. దీంతో నారుమళ్లు దెబ్బతిన్న రైతులు నారు కొనుగోలు చేసి నాట్లు వేసేందుకు సిద్ధపడుతున్నారు.

దెబ్బతిన్న 500 ఎకరాల్లోని నారుమళ్లు

బోగోలు మండలంలో ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు సుమారు 500 ఎకరాల్లో నాటేందుకు సిద్ధంగా ఉన్న పెద్ద జిలకర రకం నారుమళ్లు దెబ్బతిన్నాయి. సుమారు 20 రోజుల నుంచి 30 రోజుల వయస్సున్న నారుమళ్లు దెబ్బతినడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మళ్లీ నార్లు పోసే సమయం లేకపోవడంతో బయట నారు కొనుగోలు చేసి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దగదర్తి, అల్లూరు మండలాల్లోని రైతుల నుంచి నారు కొనుగోలు చేసేందుకు పోటీ పడుతున్నారు. దీంతో నారుకు భారీగా డిమాండ్ ఏర్పడింది.

ఎకరాకు రూ.3,500 వరకు వెచ్చించి

మళ్లీ నార్లుపోసి నాట్లు వేయడం వల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లడంతో పాటు అదును దాటిన తరువాత నాట్లు వేస్తే తెగుళ్లు సోకి పంట దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. దీంతో రైతులు ఎకరాకు సరిపడా నారుకు రూ.2,500 నుంచి నుంచి రూ.3,500 వరకు చెల్లించేందుకు సిద్ధపడుతున్నారు. నారు ఖర్చుతో పాటు నారు తరలించేందుకు ట్రాక్టర్ బాడుగ, కూలీల ఖర్చు అదనం. దీంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. అదను దాటిపోక ముందే నాట్లు వేయాలనే తాపత్రయంతో రైతులు ఆర్థిక భారానికి సిద్ధమైనా కూలీల కొరత కూడా వేధిస్తోంది. స్థానికంగా కూలీలు దొరక్కపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి ఆటోల్లో కూలీలను పిలిపించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వరుస వర్షాలు, దెబ్బతిన్న నారుమళ్లు, కూలీల కొరత, అనుకూలించని వాతావరణ పరిస్థితులు వరుసగా దాడి చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దళితులను అణగదొక్కుతున్న కూటమి ప్రభుత్వం





ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న పందిటి కామరాజు, కాటా సురేంద్రరెడ్డి

కావలి: సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులను ఉక్కుపాదంతో అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన పందిటి కామరాజు, కాటా సురేంద్రరెడ్డి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అన్ని వేళల్లో అండగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రామిరెడ్డి వారికి సూచించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం దళితులపై దుర్నీతితో వ్యవహరిస్తూ అక్రమ కేసులు బనాయిస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తేవడం, ప్రశ్నించడమే పాపమన్నట్లుగా వ్యవహరిస్తోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలు, అక్రమాలు, వైఫల్యాలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినందుకు ఎస్సీ వర్గానికి చెందిన సామాజిక కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా పింఛన్లకోసం రెండు లక్షల మంది ఎదురు చూస్తుండగా ఏ మాత్రం పట్టించుకోకుండా సాకులు చెబుతూ ఆరు నెలల్లో ఏకంగా 1.57 లక్షల పింఛన్లను తొలగించారన్నారు. ఇంకా పింఛన్లను ఎత్తేయడానికి కొత్తగా సర్వే నాటకాన్ని మొదలు పెట్టారన్నారు. అలవిగాని హామీలతో అన్ని వర్గాలను మోసం చేసిన సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, తీసుకొచ్చిన వ్యవస్థలను రద్దు చేసి పేద వర్గాలకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. ఒక ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి ఏటా రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పిన 'తల్లికి వందనం' ఊసే ఎత్తడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 లక్షల మంది తల్లులు ఎదురు చూస్తున్నారన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచం..పైగా తగ్గిస్తాం.. నేను గ్యారెంటీ అంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఐదు నెలలు గడవక ముందే విద్యుత్తు చార్జీల మోత మోగిస్తూ ప్రజలకు షాక్ ఇస్తున్నారన్నారు. విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ నెల 27న నియోజకవర్గ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఉమ్మడి కుటుంబంతోనే ప్రేమానుబంధాలు



మాట్లాడుతున్న వక్తలు

ఆత్మకూరు: ఉమ్మడి కుటుంబ వ్యవస్థతో వ్యక్తుల మధ్య ప్రేమానుబంధాలు బలపడతాయని ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ ఎస్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరుకు చెందిన తెలుగుభారతి సేవా సమితి ప్రతి నెలా నిర్వహించే మంచి మాట కార్యక్రమాన్ని పట్టణంలోని చావడి సెంటర్ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామ్మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశంలో అనాధిగా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కొనసాగి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించాయని, ప్రపంచంలోని ఇతర దేశాలకు మనదేశం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఉమ్మడిగా ఉంటే ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉండి కుటుంబ వ్యవస్థ బలపడుతుందన్నారు. ఇళ్లలోని పెద్దవారిని భారంగా భావించరాదని, ఆస్తులుగా భావించాలన్నారు. వారి జీవిత అనుభవాలు, సలహాలు యువతకు భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇటీవల కాలంలో ఒంటరితనం కారణంగా మానసిక ఒత్తిడి పెరిగి రోగాల బారిన పడుతున్నారన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కొనసాగిన రోజుల్లో ఇలాంటి రోగాలు దరిచేరలేదన్న విషయాన్ని భవిష్యత్ తరాల వారు గుర్తించేలా మనం మనుగడ సాగించాలన్నారు. సేవా సమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షుడు ఏ గోవిందరెడ్డి, కార్యదర్శులు జీ రామిరెడ్డి, కొల్లా వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసరావు, సభ్యులు ఎస్వీ రమణయ్య, కేవీ శేషారెడ్డి, వీ నారాయణరావు, రామయ్యస్వామి, రవీంద్ర, శివరామిరెడ్డి, సురేష్‌బాబు, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణానికి చెందిన బాధిత కుటుంబాలకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. 1వ వార్డుకు చెందిన యేసిపోగు పెంచలయ్య, 4వ వార్డుకు చెందిన పోతల రాగయ్య, 7వ వార్డుకు చెందిన షేక్ కరీముల్లా, 9వ వార్డుకు చెందిన కామిశెట్టి రామచంద్రరావు, 11వ వార్డుకు చెందిన తంగెళ్లపల్లి లక్ష్మమ్మ, 13వ వార్డుకు చెందిన ఎస్ పెంచలయ్య, 15వ వార్డు గిరిజనకాలనీకి చెందిన కొమరగిరి నారమ్మ, 23వ వార్డుకు చెందిన పఠాన్‌బాబు ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో మృతుల కుటుంబాలకు రూ.10వేలు చొప్పున నగదు చెక్కులను ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్ రెడ్డి, నరసింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వరంలో ఎమ్మెల్యే కాకర్ల పూజలు

సీతారామపురం : మండలంలోని సిద్దేశ్వరం క్షేత్రాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. తనయుడు సంహిత్ పుట్టినరోజు సందర్భంగా పరమశివునికి అభిషేకంతో పాటు అన్నపూర్ణాదేవికి కుంకుమార్చన నిర్వహించారు.

నాగవరపమ్మకు పూజలు



సంగం: మండలంలోని కోలగట్లలో పెన్నానది ఒడ్డున ఉన్న నాగవరపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగవరపమ్మను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రోడ్డు ఇలా..రాకపోకలెలా?



చేజర్ల: మండలంలోని మడపల్లి వద్ద కలువాయి-చేజర్ల రోడ్డు దారుణంగా ఉంది. ఈ మార్గం నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. తారులేచిపోయి అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చవిచూస్తున్నారు. మండలంలోని కోటితీర్థం క్షేత్రానికి జిల్లా నలుమూలల నుంచి ప్రతి సోమవారం భక్తులు తరలివస్తుంటారు. కలువాయి మీదుగా కోటితీర్థం క్షేత్రం చేరుకుంటుంటారు. కలువాయి-చేజర్ల రోడ్డు దారుణంగా ఉండడంతో భక్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా రోడ్లపై దృష్టి సారించకపోవడంపై వాహనచోదకుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

దోస ధరలు పతనం



ఉదయగిరి: ఈ ఏడాది అక్టోబరులో వింజమూరు, ఉదయగిరి వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో సుమారు 500 ఎకరాల్లో దోస పంట సాగు చేశారు. ఏటా రబీ సీజన్‌లో మెట్టప్రాంత రైతులు మినుము పంట సాగుచేస్తారు. మినుము సాగుకు అధిక పెట్టుబడులు అవుతుండడం..దిగుబడులు ఆశాజనకంగా రాక నష్టాలు వస్తుండడంతో ఈ ఏడాది రైతులు దానికి బదులు దోస పంటను విస్తారంగా సాగు చేశారు. ప్రస్తుతం దోస కాయలు కోతకు వచ్చాయి. అయితే మార్కెట్లో ధరలు లేక వ్యాపారులు కొనుగోలు చేయడంలేదు. నవంబర్ నెలలో బస్తా కాయల ధర రూ.1000కుపైగా ఉండగా, ప్రస్తుతం బస్తా ధర రూ.400కు పతనమైంది. వర్షాలకు తెగుళ్లు ఆశించి పంట దెబ్బతిని దిగుబడులు తగ్గాయి. దీనికి తోడు ధరలు పతనమవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

29న బలిజల ఆత్మగౌరవ సభ



కావలి: నెల్లూరులోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం వద్ద ఉన్న కాపు భవన్‌లో ఈ నెల 29న బలిజల ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు రాయలసీమ బలిజ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు వెలిశెట్టి శ్రీహరి రాయల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కలిగిన పేద బలిజ విద్యార్థులకు ఉపకారవేతనాలు, బలిజ బంధు పురస్కారాలను అందజేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని బలిజ సామాజిక వర్గీయులందరూ హాజరుకావాలని కోరారు.

సీతారామపురం : బలిజల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని సీతారామపురం మండల బలిజ సంక్షేమ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం సీతారామపురంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఆత్మగౌరవ సభలో కాపునాడు చైర్మన్ మిరియాల వెంకటరావు జయంతి, వంగవీటి మోహనరంగా వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో శిగే కొండయ్య, రామిశెట్టి తిరుపతయ్య, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, గుండా సురేష్, పసుపులేటి వికాస్‌బాబు, బాలయ్య, కాశయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

కావలి: కావలిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు వన్ టౌన్, టు టౌన్, కావలి రూరల్ పోలీస్‌స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్సైలు, సిబ్బంది శనివారం రాత్రి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. లాడ్జిల్లో ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి బస చేసిన వ్యక్తుల వివరాలను సేకరించారు. అనుమానితులను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని యజమానులకు సూచించారు. లాడ్జిల పరిసరాలు స్పష్టంగా కనిపించేలా సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని అన్ని కూడళ్లలో విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు చేశారు. హెల్మెట్ ధరించాలని, ధ్రువీకరణపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డెఫెక్టివ్ నంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ తదితర ఉల్లంఘనులకు పాల్పడితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ అందక ఇక్కట్లు

ఆత్మకూరు: పట్టణంలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ సరిగా అందడం లేదు. దీంతో మొబైల్‌తో పాటు వైర్‌లెస్ ల్యాండ్‌ఫోన్లు పనిచేయక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వినియోగదారులు వాపోతున్నారు. పట్టణంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఉంది. పలుచోట్ల సెల్ టవర్లు ఉన్నాయి. గత నెల రోజులుగా టవర్ల నుంచి సిగ్నల్స్ సక్రమంగా అందడం లేదు. ఇటీవల వర్షాల వల్ల సిగ్నల్స్ అందడం లేదేమోనని వినియోగదారులు భావించారు. ప్రస్తుతం వాతావరణం మెరుగ్గా ఉన్నా సిగ్నల్స్ అందడం లేదని వారు వాపోతున్నారు. ఫోన్ చేస్తే రింగ్ వినిపించకపోవడం, ఎప్పటికో కనెక్ట్ అవడం..అయినా కొన్ని సెకన్లకే కట్ అవడం, మాటలు సరిగా వినిపించకపోవడం, తదితర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆరోపిస్తున్నారు.

మురుగు తొలగించరూ..



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు ప్రియదర్శినినగర్‌లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఇక్కడ ఇళ్ల మధ్యలో సుమారు 200 అంకణాలకుపైగా ఖాళీ స్థలం ఉంది. యజమానులకు పంపకాల్లో వివాదాలు ఏర్పడడంతో స్థలాన్ని నిరుపయోగంగా వదిలేశారు. దీంతో చెత్త, మురుగు నిల్వ చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. మురుగు దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి స్థలం యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



సీతారామపురం : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి హెచ్ఎం శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. గణిత దినోత్సవ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు గణితానికి సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. అనంతరం గణితంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబు



విద్యుద్దీపాలంకరణలో తెలుగు బాప్టిస్ట్ చర్చి

కావలి: పట్టణంలోని చర్చిలు క్రిస్మస్‌కు ముస్తాబయ్యాయి. క్రిస్మస్‌కు మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉండడంతో చర్చిలను రంగు రంగుల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయగిరి రోడ్డులోని తెలుగు బాప్టిస్ట్ చర్చి విద్యుత్ దీపకాంతుల్లో శోభాయమానంగా దర్శనమిస్తోంది.

అల్లుకున్న నిర్లక్ష్యం



వరికుంటపాడు: మండలంలోని తూర్పుబోయమడుగులకు వెళ్లే మార్గంలో వరికుంటపాడు సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిచెట్లు, కంపచెట్లు పూర్తిగా అల్లుకుపోయాయి. వాటిని తొలగించాల్సిన విద్యుత్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో పిచ్చితీగలు విద్యుత్‌తీగలపైకి పాకుతున్నాయి. పచ్చటి చెట్ల వద్దకు మూగజీవాలు వెళ్లి ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పొగమంచు.. ప్రమాదాలకు నెలవు

- ఉదయం 7 గంటల వరకు వీడని మంచుతెరలు
- రోడ్లపై కనిపించని ఎదురుగా వచ్చే వాహనాలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనచోదకులు



ఉదయగిరి రోడ్డును కమ్మేసిన పొగ మంచు



హైవేపై నుజ్జునుజ్జైన కంటైనర్

కావలి: పొగ మంచు కమ్మేస్తోంది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మంచుతెరలు వీడడం లేదు. దీంతో రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధానంగా చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై వేకువజామున ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. చలి, పొగమంచుకు వెళ్లలేక కొందరు వాహనచోదకులు వాహనాలను హైవే మార్జిన్లలో నిలిపేస్తున్నారు. హైవేపై ఉన్న దాబాలు, రెస్టారెంట్ల వద్ద టీ తాగేందుకు మరికొందరు వాహనచోదకులు వాహనాలను మార్జిన్లలో నిలుపుతున్నారు. పొగమంచుకు మార్జిన్లలోని వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వేకువజాము నుంచి పొగమంచు తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అదే సమయంలో డ్రైవర్లు నిద్రమత్తులో ఉండి పొగమంచులో వాహనాలను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. పొగమంచులో నెమ్మదిగా వెళ్లడం, హెడ్‌లైట్లను బ్లింక్ చేయడం, వాహనాలను ఓవర్‌టేక్ చేయకుండా వెళ్లడం, వాహనాలకు వెనుక, ముందు రేడియం స్టిక్కర్లను అతికించడం, నిద్ర మత్తులో డ్రైవింగ్ చేయకపోవడం, తదితర జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు.

- ఈ నెల 15న కావలి మండలం రుద్రకోట వద్ద చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కంటైనర్ ఢీకొంది. ఒంగోలు నుంచి నెల్లూరుకు జామాయిల్ కర్ర లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ పొగ మంచుతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని రోడ్డు మార్జిన్‌లో నిలిపివేశాడు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా చీమకుర్తి నుంచి చెన్నైకు గ్రానైట్ లోడును తీసుకెళ్తున్న కంటైనర్ డ్రైవర్ రోడ్డు మార్జిన్‌లో నిలిపిన లారీని పొగమంచులో గుర్తించక ఢీకొన్నాడు. దీంతో జామాయిల్ లోడు లారీ హైవే పక్కనున్న పొదల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. కంటైనర్ ముందుకు భాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కంటైనర్ డ్రైవర్ జయబాలుకు గాయాలయ్యాయి.
- ఈ నెల 20న కావలి రూరల్ మండలం గౌరవంలోని దాబాల వద్ద కృష్ణపట్నం పోర్టు నుంచి ఒంగోలు వైపు పామాయిల్ లోడుతో వెళ్తున్న ట్యాంకర్‌ను కేరళ నుంచి టెంకాయల లోడుతో ఒంగోలు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. పామాయిల్ ట్యాంకర్‌ను డ్రైవర్ టీ తాగేందుకు రోడ్డు మార్జిన్‌లో నిలపగా, టెంకాయల లోడు లారీని మార్జిన్‌లో నిలిపే క్రమంలో డ్రైవర్ పొగమంచులో ట్యాంకర్‌ను గుర్తించక వెనుకగా చిన్నగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో లారీ ముందు గ్లాసు పగిలింది.
- ఇటీవల ఒంగోలు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మినీలారీ డ్రైవర్‌కు నిద్ర రావడంతో అర్ధరాత్రి వేళ మద్దూరుపాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద నుంచి కావలి పట్టణంలోకి వచ్చే అప్రోచ్ రోడ్డు మార్జిన్‌లో నిలిపేసి నిద్రపోయాడు. ఈ క్రమంలో ఒంగోలు నుంచి కావలికి వస్తున్న లారీ డ్రైవర్ పొగమంచులో ఆగి ఉన్న మినీ లారీని గుర్తించక ఢీకొన్నాడు. దీంతో మినీ లారీ వెనుక భాగం దెబ్బతింది.

రోడ్డు మార్జిన్లలో వాహనాలు నిలపకుండా చర్యలు



హైవే మొబైల్ సిబ్బందితో రాత్రి వేళల్లో రోడ్డు మార్జిన్లలో వాహనాలు నిలపకుండా చూస్తున్నాం. పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. జనవరి వరకు రాత్రి వేళల్లో వాహనచోదకులు ప్రయాణించకపోవడం ఉత్తమం. క్రిస్మస్, సంక్రాంతి సెలవులకు కుటుంబ సభ్యులతో ఇతర ప్రాంతాలకు కార్లలో వెళ్లే వారు రాత్రి వేళల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే తక్కువ వేగంతో వెళ్లాలి. రోడ్డు స్పష్టంగా కనిపించకపోతే సురక్షితమైన స్థలంలో వాహనాన్ని నిలిపి విశ్రాంతి తీసుకోవాలి. రోడ్డు మార్జిన్లలో ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను నిలపరాదు.

–బీ పాపారావు, కావలి రూరల్ సీఐ